

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక పద్మ అవార్డులకు కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తుందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవల్లో విశేష కృషి చేసిన వారిని పద్మ అవార్డుల కోసం ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. జిల్లా నుంచి సామాజిక సేవల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారు, తగు అర్హత, ఆసక్తి ఉన్నవారు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మిగతా వివరాలకు హెచ్‌టీటీపీ://అవార్డ్స్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు. సెప్టెంబరు 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

ఇంకెప్పటికో..?





భామినిలో అర్ధాంతరంగా నిలిచిన ఏకలవ్య పాఠశాల డార్మెటరీ భవనం పనులు

- ఏకలవ్య భవనాలు అందుబాటులోకి వచ్చేదెప్పుడో..
- కలెక్టర్ ఆదేశించినా.. జోరందుకోని నిర్మాణాలు
- ఏళ్లు గడుస్తున్నా.. పూర్తి కాని పనులు
- గత ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ సర్కారు
- బిల్లుల మంజూరులో జాప్యం
- కొన్ని మండలాల్లో పరాయి పంచనే నిర్వహణ
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

భామిని

జిల్లాలో ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాలకు మోక్షం లభించడం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. పనులు తుది దశకు చేరుకోవడం లేదు. స్వయంగా కలెక్టర్ పరిశీలించి.. నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో ఎటువంటి మార్పు లేదు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవస్థలు తప్పడం లేదు. వాస్తవంగా జిల్లాలోని కురుపాం, గుమ్మలక్ష్మీపురం, మక్కువ, పాచిపెంట, భామినిలో ఏకలవ్య పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో గుమ్మలక్ష్మీపురం మినహా.. మిగతాచోట్ల ఎక్కడా భవనాల నిర్మాణాలు పూర్తవలేదు. గత ఐదేళ్లూ వాటిపై వైసీపీ సర్కారు దృష్టి సారించలేదు. పైగా ఎన్నికల కోడ్‌కు ముందు వైసీపీ నేతలు హడావుడిగా మక్కువ మండలం అనసభద్రలో, కురుపాంలో భవనాల ప్రారంభోత్సవం జరిపారు. అయితే వాటిల్లో ఇంకా ఎన్నో పనులు చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఏకలవ్య పాఠశాలల భవన నిర్మాణాల బాధ్యతను ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగించారు. మరోవైపు గత వైసీపీ సర్కారు సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడం కూడా పనుల జాప్యానికి కారణంగా తెలుస్తోంది. ఏదేమైనా భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతుండడంతో పాచిపెంట మండలం కొటికపెంట ఏకలవ్య పాఠశాలను అదే మండలం సరాయివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో, కురుపాం పాఠశాలను పార్వతీపురంలో, మక్కువ ఏకలవ్యను అదే మండలం ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో గత ఐదేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇరుకు గదులు, మౌలిక వసతుల కొరతతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

● భామినిలో ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి కేంద్ర సర్కారు 2013న రూ.12 కోట్లు కేటాయించింది. అయితే స్థల సేకరణ సమస్య నెలకొనడంతో టెండర్ల ప్రక్రియ జాప్యమైంది. ఎట్టకేలకు 2019లో భామిని సమీపంలో 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. ఆ తర్వాత టెండర్లు ఖరారయ్యాయి. 2022 నాటికి భవనాల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. అయితే నేటికీ పనులు పూర్తికాలేదు. పాఠశాల భవనం, కిచెన్ రూమ్, డార్మెటరీ భవనాల నిర్మాణం పూర్తవగా..వాటికి విద్యుత్, నీటి సౌకర్యాలు లేవు. కిటికీలు అమర్చడం వంటి పనులెన్నో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభానికి భవనాలు అందిస్తారని ఆశించిన విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బందికి నిరాశే ఎదురైంది. ఏదేమైనా పనులు నత్తనడకన సాగుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో కొన్నేళ్లుగా భామిని ఏకలవ్య పాఠశాలను శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో నిర్వహిస్తున్నారు. అయితే ఇరుకు గదుల్లో విద్యార్థులు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రస్తుతం ఏకలవ్యలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అయితే చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు భామిని వచ్చి నిరాశ చెందుతున్నారు. ఈసురోమంటూ 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తూరు వెళ్తున్నారు. ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు సీబీఎస్‌లో విద్యాబోధన ఉన్నప్పటికీ అన్ని సౌకర్యాలు భామినిలో ఏర్పాటు చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారు.

కలెక్టర్ ఆదేశించినా..

గత ఏడాది జూన్ నెలలో భామిని ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాలను కలెక్టర్ నిశాంత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ ప్రతినిధులకు తీవ్రంగా హెచ్చరించారు. గత ఏడాది డిసెంబర్‌లోనే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద బౌండరీ వాల్, ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అయితే డిసెంబర్ వరకు కొంత మేర పనులు ముందుకు సాగినా.. జనవరిలో నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. కలెక్టర్ ఆదేశాలతో ఈ ఏడాది విద్యా సంవత్సరానికైనా భామిని ఏకలవ్య పాఠశాల అందుబాటులోకి వస్తుందని భావించిన విద్యార్థుల తల్లిదండ్రులకు నిరాశ ఎదురైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.



భామిని ఏకలవ్య పాఠశాల బాత్‌రూమ్‌లో రన్నింగ్ వాటర్ ట్యాప్‌లు తదితర వాటిని ఏర్పాటు చేయని దృశ్యం



కురుపాంలో నిర్మాణాలు పూర్తికాకముందే హడావుడిగా ప్రారంభోత్సవం చేసిన వైసీపీ నేతలు

పనుల వేగవంతానికి చర్యలు..

భామినిలో ఏకలవ్య పాఠశాలలో తరగతి గదులు, డార్మెంటరీ నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. విద్యుత్ సరఫరా, రహదారి నిర్మాణం, ఇతరత్రా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మరికొన్ని పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచిస్తున్నాం. ఏదేమైనా ఈ నెలాఖరు నాటికి నిర్మాణాలు పూర్తి చేస్తాం. ఈ ఏడాది మార్చి నుంచి రూ.5కోట్ల వరకు బిల్లుల చెల్లింపులు అవ్వలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-సింహాచలం, ఈఈ, సీతంపేట ఐటీడీఏ

నేడు కలెక్టరేట్‌లో మంత్రి సమీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపాలంటున్న ప్రజలు



పార్వతీపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గుమ్మిడి సంధ్యారాణి తొలిసారిగా గురువారం పార్వతీపురం కలెక్టరేట్‌లో అడుగుపెట్టనున్నారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులతో సమీక్షించనున్నారు. శాఖల వారీగా సమస్యలపై చర్చించి యుద్ధప్రాతిపదికన తీసుకోవాల్సిన చర్యలు, ప్రాధాన్య క్రమంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించనున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ప్రజలు గత ఐదేళ్లుగా ఎదుర్కొంటున్న వెతలు, చేపట్టాల్సిన నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై విస్తృతంగా చర్చించే అవకాశం ఉంది. అనంతరం సంబంధిత అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేయనున్నారు. కాగా 'మన్యం'లో ఈ కింది ప్రధాన సమస్యలపై మంత్రి, అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.. ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారాన్ని తిరిగి తెరిపించాల్సి ఉంది. అడారిగెడ్డ రిజర్వాయర్, పార్వతీపురంలో బైపాస్ రహదారి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, పూర్ణపాడు-లాబేసు, సీతానగరం వంతెనల నిర్మాణం, సాలూరులో వంద పడకల ఆసుపత్రి నిర్మాణాలపై దృష్టి సారించాల్సి ఉంది. గిరిజన గర్భిణుల వసతిగృహాలు, వైటీసీలు, జీసీసీకి పూర్వ వైభవం తీసుకొచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలి. రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ అయ్యేలా చూడాలి. పెద్దగెడ్డ, వీఆర్ఎస్, పెదంకలం తదితర సాగునీటి ప్రాజెక్టుల పనులను జైకా నిధులతో వేగవంతం చేయాల్సి ఉంది. గిరిజన యూని వర్శిటీ, సాలూరులో ప్రభుత్వ ఐటీఐ భవనాల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. పాలకొండలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టాల్సి ఉంది. జిల్లాలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములు, చెరువులను పరిరక్షించాలి. తాగు, సాగునీరు విద్య, వైద్యం, ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, మౌలిక వసతులు, ఇసుక దోపిడీపై చర్చించాల్సి ఉంది. వీరఘట్టంలో ప్రధాన రహదారి పనులు పూర్తి చేయాలి. తోటపల్లి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి, ఈ ప్రాజెక్టు ద్వారా శివారు భూములకు సాగునీరు అందించాల్సి ఉంది.



డ్రగ్స్ నియంత్రణే లక్ష్యం: ఎస్పీ

యువతను సన్మార్గంలో నడిపించేందుకు డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా పనిచేద్దామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులతో కలిసి జిల్లా కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఈ ర్యాలీలో ఏఎస్పీలు, సీఐ తదితరులు పాల్గొన్నారు.

- పార్వతీపురం టౌన్

ఘన స్వాగతం..



ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా పార్వతీపురం వచ్చిన బోనెల విజయచంద్రకు బుధవారం శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అడుగడుగునా ఆయనకు హారతులిచ్చి.. ఆహ్వానం పలికారు. అనంతరం వారు భారీ ర్యాలీ నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

- (పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)



జేజేఎం ట్యాప్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ: కలెక్టర్

పాలకొండ, జూన్ 26: సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో డయేరియా, ఇతరత్రా అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. బుధవారం పాలకొండలోని కస్పా, చినకాపువీధుల్లో కాలువలను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. పారిశుధ్య మెరుగు చర్యలపై మే నెలలోనే ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఇంతవరకు కాలువలు శుభ్రం చేయకపోవడం ఏమిటని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావును ప్రశ్నించారు. మురుగు కాలువల్లో క్లోరినేషన్ పిచికారీ చేయించాలని, దోమలు వృద్ధి చెందకుండా చూడాలని ఆదేశించారు. వీధుల్లో పాలిథిన్ కవర్లు, చెత్త పేరుకుపోకుండా చూడాలని సూచించారు. అనంతరం నీలమ్మకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చేతులు పరిశుభ్రంగా కడుక్కునే విధానంపై పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో వైద్యాధికారులు శిబిరాలు నిర్వహించాలని, డయేరియా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

గరుగుబిల్లి: గ్రామాల్లో పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ నిశాంత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం తోటపల్లిలో నిర్వహించిన పారిశుధ్యం పనులను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. విధిగా తాగునీటి పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం గ్రామంలోని జల జీవన్ మిషన్ కొళాయిలను, రక్షిత పథకాన్ని పరిశీలించారు.

దంచికొట్టిన వాన

- జిల్లాలో భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీరు
- చల్లబడిన వాతావరణం
- ఉక్కపోత నుంచి ఊరట చెందిన ప్రజలు



భామినిలో..

పార్వతీపురం టౌన్/ భామిని/ సాలూరు రూరల్/కొమరాడ/ముక్కువ, జూన్ 26 : జిల్లావ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. చాలా రోజుల తర్వాత ఏకధాటిగా వాన పడింది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు కురిసిన వానకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లా కేంద్రం పార్వతీపురంలో ప్రధాన రహదా రిపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించలేకపో యారు. పట్టణంలోని మేదర వీధి నుంచి పాతబస్టాండ్ కూడలి వరకు వర్షపునీరు నిలిచిపోవడంతో నివాసితులకు కష్టాలు తప్పలేదు. భామిని మండలంలోని గ్రామాల్లో రోడ్లపైనే వర్షపునీరు ప్రవహించింది. కొమరాడ, సాలూరు, వీరఘట్టం, సీతానగరం, పాచి పెంట, మక్కువ తదితర మండలాల్లో రాత్రి వరకూ ఈదురుగాలులతో ఎడతెరిపిలేని వాన కురిసింది. ఏదేమైనా మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత , ఉక్కపోతకు విలవిల్లాడిన జనం వర్షంతో ఊరట చెందారు. ఒక్కసారిగా వాతా వరణం చల్లబడడంతో కాస్త సేదతీరారు. మరోవైపు రైతులు ఖరీఫ్ పనుల్లో నిగమ్నమయ్యారు. ప్రధానంగా పత్తి, వరి పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అనేకమంది వరి ఎదలను జల్లడం పూర్తి చేశారు. అవి మొలకలు రావడానికి ఈ వర్షం ఎంత గానో ఉపయోగపడుతుందని రైతులు భావిస్తున్నారు. మరోవైపు మెట్ట పంట అయిన పత్తిని విత్తేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు.




పార్వతీపురం ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపునీరు



ముక్కువలో..

పీజీ, పీహెచ్‌డీ



పెట్రో వర్సిటీ

అమేథీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ(ఆర్‌జీఐపీటీ)- ఎంటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రెగ్యులర్, ఎక్స్‌టర్నల్, స్పాన్సర్డ్, పార్ట్ టైం విధానాల్లో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. జైస్‌లోని ఆర్‌జీఐపీటీ, బెంగళూరులోని ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్, శివసాగర్‌లోని అస్సాం ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

ఎంటెక్ విభాగాలు-సీట్లు: జైస్ ఆర్‌జీఐపీటీలో కెమికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్ విభాగాల్లో ఒక్కోదానిలో 10 సీట్లు ఉన్నాయి. బెంగళూరు ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్‌లో రెన్యూవబుల్ ఎనర్జీ 15, ఎలక్ట్రానిక్ వెహికిల్ టెక్నాలజీ 20 సీట్లు ఉన్నాయి.

పీహెచ్‌డీ విభాగాలు-సీట్లు

- జైస్ ఆర్‌జీఐపీటీలో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయోకెమికల్ ఇంజనీరింగ్ 6, సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ 7, పెట్రోలియం ఇంజనీరింగ్ అండ్ జియో ఇంజనీరింగ్ 3, మేథమెటికల్ సైన్సెస్ 3, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 2, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 6, మేనేజ్‌మెంట్ స్టడీస్ 2 సీట్లు ఉన్నాయి.
- ఈఐటీ సెంటర్లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాలకు గాను మొత్తం 6 సీట్లు ఉన్నాయి.
- ఏఈఐ సెంటర్లో కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, పెట్రోలియం ఇంజనీరింగ్, ఫిజిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫైర్ అండ్ సేఫ్టీ ఇంజనీరింగ్ విభాగాలకు గాను మొత్తం 9 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు

- ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
- పీహెచ్‌డీలో ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధిత విభాగంలో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్ లేదా కనీసం 65 శాతం మార్కులతో మాస్టర్స్ ఇన్ సైన్స్ లేదా 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. సైన్సెస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ ఇన్ సైన్స్ లేదా కనీసం 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ ఇన్ సైన్స్ ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. హ్యూమానిటీస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ ఇన్ ఇంజనీరింగ్ లేదా మాస్టర్స్ డిగ్రీ(హ్యూమానిటీస్/సైన్సెస్) లేదా 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/సైన్సెస్)+రెండేళ్ల అనుభవం ఉండాలి. మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ (మేనేజ్‌మెంట్) లేదా 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్)+రెండేళ్ల అనుభవం ఉండాలి. అన్ని విభాగాలకు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఎంపిక

- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి గేట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూలు నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ స్కోర్ లేని అభ్యర్థులు సంస్థ నిర్వహించే రిటెన్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఇందులో అర్హత పొందినవారిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు.
- పీహెచ్‌డీలో ప్రవేశానికి కూడా సంస్థ నిర్వహించే రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుంది. నేషనల్ లెవెల్ స్కాలర్‌షిప్‌లు సాధించినవారు, కనీసం 80 శాతానికి మించి అకడమిక్ మార్కులు ఉన్నవారు ఇంటర్వ్యూలకు హాజరైతే చాలు.
- ఎక్స్‌టర్నల్, స్పాన్సర్డ్, పార్ట్ టైం ప్రోగ్రామ్‌లలో చేరేవారు రాత పరీక్ష రాయనవసరం లేదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ. 500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూలై 5
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** జూలై 11, 12
- **అడ్మిషన్స్ పొందిన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 16
- **తరగతులు ప్రారంభం:** జూలై 30 నుంచి
- **వెబ్‌సైట్:** rgipt.ac.in

నలంద యూనివర్సిటీ

బిహార్‌లోని నలంద యూనివర్సిటీ-మాస్టర్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మాస్టర్స్‌లో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. విదేశీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్ మాట్లాడని దేశాలకు చెందిన అభ్యర్థులు, ఆంగ్ల మాధ్యమంలో చదవని వారు టోఫెల్/ఐఈఎల్‌టీఎస్/టీఓఈఐసీ/ పీటీఈ/ ఎస్‌టీఈపీ అర్హత పొంది ఉండాలి. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు ప్రోగ్రామ్‌లకు అప్లయ్ చేసుకొనే వీలుంది. మాస్టర్స్ ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. పీహెచ్‌డీ వ్యవధి నాలుగేళ్లు. ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ఏడాది కోర్సు పూర్తిచేసిన తరవాత డిప్లొమాతో ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది.

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** హిందూ స్టడీస్(సనాతన), వరల్డ్ లిటరేచర్, హిస్టారికల్ స్టడీస్, బుద్ధిస్ట్ స్టడీస్-ఫిలాసఫీ అండ్ కంపారటివ్ రెలిజియన్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ పీస్ స్టడీస్, ఆర్కియాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్:** సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్:** ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్
- **పీహెచ్‌డీ స్పెషలైజేషన్‌లు:** వరల్డ్ లిటరేచర్, సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్, హిస్టారికల్ స్టడీస్, బుద్ధిస్ట్ స్టడీస్-ఫిలాసఫీ అండ్ కంపారటివ్ రెలిజియన్స్, హిందూ స్టడీస్(సనాతన)

అర్హత

- మాస్టర్స్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ (హ్యూమానిటీస్/సైన్సెస్/ఇంజనీరింగ్/మేనేజ్‌మెంట్/లా) ఉత్తీర్ణులై ఉండాలి. 250 పదాలకు మించకుండా సెల్ఫ్ ఇంట్రడక్షన్/ బయోనోట్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాలి. స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్‌ఓపీ)లో భాగంగా వంద పదాలకు మించకుండా నలంద యూనివర్సిటీలో చదవాలనుకోవడానికి కారణాలు, 300 నుంచి 500 పదాలకు మించకుండా సంబంధిత ప్రోగ్రామ్‌ను ఎంచుకోవడానికి గల కారణాలు వివరిస్తూ ఆర్టికల్ రాయాలి.
- ఎంబీఏ (సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో చేరాలనుకొనేవారు కనీసం 70 శాతం స్కోర్‌తో క్యాట్/ఎక్స్‌ఏటీ/మ్యాట్ అర్హత పొంది ఉండాలి. ప్రభుత్వ సంస్థలు/ప్రముఖ పీఎస్‌యూలలో కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్న వర్కింగ్ ఎగ్జిక్యూటివ్‌లకు ఈ స్కోర్ అవసరం లేదు. విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ స్కోర్ లేదా డిగ్రీ స్థాయిలో 3/4 జీపీఏ ఉండాలి.
- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కనీసం 65 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ/ఎంఫిల్ పూర్తిచేసి ఉండాలి. సెల్ఫ్ ఇంట్రడక్షన్, రికమండేషన్/రిఫరెన్స్ లెటర్స్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, రీసెర్చ్ ప్రపోజల్, ఏవైనా రెండు/మూడు పబ్లిష్‌డ్ లేదా నాన్ పబ్లిష్‌డ్ పేపర్స్ సబ్మిట్ చేయాలి. పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో చేరాలంటే కనీసం ఎనిమిది నుంచి పదేళ్ల అనుభవం ఉండాలి.

ఎంపిక: ప్రోగ్రామ్‌ను అనుసరించి అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్, ఇంగ్లీష్ సంబంధిత టెస్ట్ స్కోర్‌లు, ఎస్‌ఓపీ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు ఈమెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 10
- **వెబ్‌సైట్:** nalandauniv.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/laCRootలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో జీఎంఈ ట్రెయినింగ్

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఆధ్వర్యంలోని మెరైన్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఈటీఐ)- గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీరింగ్(జీఎంఈ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా ఏడాదిపాటు ప్రీ సీ ట్రెయినింగ్ ఉంటుంది. ఇది ఏడాది వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఈ ప్రోగ్రామ్‌నకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీఎస్) గుర్తింపు ఉంది. స్టయిపెండ్ సౌకర్యం లేదు. మొత్తం 114 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తయిన వెంటనే ఆర్నెల్ల వ్యవధిగల షిప్‌బోర్డ్ ట్రెయినింగ్ పొందాల్సి ఉంటుంది. ఈ శిక్షణ పూర్తిచేసుకొన్న అభ్యర్థులకు డీజీఎస్ నిర్వహించే ఎంఈఓ క్లాస్- 4 సీఓసీ ఎగ్జామ్ రాసేందుకు అర్హత లభిస్తుంది.



ప్రోగ్రామ్ వివరాలు: ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. డీజీఎస్, ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్(ఐఎంఓ) నిబంధనల ప్రకారం క్లాస్ రూం తరగతులు, ల్యాబొరేటరీ వర్క్‌లు, వర్క్‌షాప్ ప్రాక్టీస్‌లతోపాటు సీ ట్రెయినింగ్ ఉంటాయి. అభ్యర్థులందరూ ట్రెయినింగ్ మాన్యువల్, వర్క్ డెయిరీ మెయింటైన్ చేయాల్సి ఉంటుంది. సమయానుసారం రిటెన్ టెస్ట్‌లు, ప్రాక్టికల్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. అడ్మిషన్ నాటికి పాస్‌పోర్ట్ పొంది ఉండాలి.


- ప్రోగ్రామ్‌నకు సంబంధించిన స్టడీ మెటీరియల్, టార్ బుక్, ట్రెయినింగ్ మాన్యువల్ అందిస్తారు. భోజన, వసతి సౌకర్యాలకు సంబంధించిన ఖర్చులన్నీ కోర్సు ఫీజులోనే ఉంటాయి. వర్కింగ్ డ్రెస్ కింద ఒక జత సేఫ్టీ షూస్, రెండు జతల బ్లాక్ సాక్స్, ఒక సేఫ్టీ హెల్మెట్ ఇస్తారు. యూనిఫామ్ కింద అయిదు వైట్ షర్ట్‌లు, రెండు బ్లాక్ ప్యాంట్‌లు, ఒక వైట్ ప్యాంట్, వైట్ క్యాప్, ఒక జత ఎపొలెటర్‌లు ఇస్తారు. పీటీ డ్రెస్ కింద రెండు బ్లూ షార్ట్‌లు, రెండు జతల వైట్ టీ షర్ట్‌లు, రెండు జతల వైట్ సాక్స్, ఒక స్విమ్మింగ్ ట్రంక్ ఇస్తారు. పర్సనల్ లాకర్, నాలుగు బెడ్‌షీట్‌లు, ఒక పిల్లో, రెండు పిల్లో కవర్‌లు, రెండు టవల్స్, ఒక మ్యాట్రెస్ కవర్ కూడా ఇస్తారు.
- ఎంపికైన అభ్యర్థులు ఒక జత బ్లాక్ షూస్, ఒక జత వైట్ కాన్వాస్ పీటీ షూస్, రెండు బ్లాక్ ప్యాంట్‌లు, మూడు బాయిలర్ సూట్‌లు(ఆరెంజ్ కలర్ ఫుల్ స్లీవ్స్ కాటన్), రెండు స్లీపింగ్ సూట్స్ (వైట్), ఒక జత స్లిప్పర్స్, షూ బ్రష్, షూ పాలిష్ (బ్లాక్, వైట్), రెయిన్ కోట్, రెండు బాత్ రోబ్స్ వెంట తెచ్చుకోవాలి. ఒక పాకెట్ క్యాలిక్యులేటర్, ఇంజనీరింగ్ డ్రాయింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్ కూడా తెచ్చుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి (బీఈ/బీటెక్) (మెకానికల్ ఇంజనీరింగ్/మెకానికల్ అండ్ ఆటోమేషన్/మెకానికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/మెకానికల్ అండ్ ఆటోమొబైల్స్/నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషన్ ఇంజనీరింగ్/ నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్ బిల్డింగ్/మెరైన్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. పదోతరగతి/ఇంటర్/ డిప్లొమా/డిగ్రీ స్థాయిలో ఇంగ్లీష్ సబ్జెక్టులో ద్వితీయ శ్రేణి మార్కులు ఉండాలి. డీజీఎస్ నిర్దేశించిన ప్రకారం మెడికల్ ఫిట్‌నెస్ ఉండాలి. అభ్యర్థుల వయసు ప్రోగ్రామ్ ప్రారంభం నాటికి 28 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: అకడమిక్ మెరిట్, మెడికల్ ఫిట్‌నెస్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సందర్భానుసారం సైకలాజికల్ స్క్రీనింగ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.4,75,000
- **అడ్మిషన్ ఛార్జెస్:** రూ.10,000
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఈ మెయిల్ ద్వారా పంపాలి. నిర్దేశిత పత్రాలు అప్‌లోడ్ చేయాలి.
- **హార్డు కాపీ చేరేందుకు చివరి తేదీ:** జూలై 31
- **చిరునామా:** హెచ్‌ఓడీ, మెరైన్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఈటీఐ), విజ్ఞాన సాగర్, గిరినగర్-682020, ఎర్నాకుళం, కేరళ.
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు 1 నుంచి
- **ఈ-మెయిల్:** metihod@cochinshipyard.in
- **వెబ్‌సైట్:** www.cochinshipyard.in

39 ఏళ్ల తర్వాత ఒకే ఫ్రేమ్‌లో



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచే ఎన్నో ఆసక్తికర అంశాలతో భారతీయ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. దశాబ్దాల తర్వాత బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ కలయికకు ఈ చిత్రం వేదిక అవ్వడం ఓ విశేషం. 1985లో వచ్చిన 'గిరఫ్తార్' చిత్రంలో అమితాబ్, కమల్ అన్నదమ్ములుగా నటించారు. మళ్లీ ఇన్నాళ్లకు 'కల్కి' చిత్రంతో వీరి కాంబినేషన్ సెట్టయింది. ఇందులో కమల్‌హాసన్ సుప్రీం యాస్కిన్ పాత్రను పోషించగా, అమితాబ్ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్నారు. వీరి కలయికతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. వీరిద్దరినీ ఒకే ఫ్రేమ్‌లో చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మించారు.

అభిమానితో నాగ్ సెల్ఫీ



ఇటీవలే ముంబై ఎయిర్‌పోర్ట్‌లో ఓ అభిమాని నాగార్జునను కలిసేందుకు ప్రయత్నించగా, సెక్యూరిటీ సిబ్బంది అతన్ని పక్కకు నెట్టేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. విమర్శలు రావడంతో ఆ సంఘటనపై నాగార్జున విచారం వ్యక్తం చేశారు. ఆ అభిమానికి ఎక్స్ వేదికగా క్షమాపణలు చెప్పారు. బుధవారం నాగార్జున ఎయిర్‌పోర్ట్‌లో ఆ అభిమానిని కలిశారు. సెక్యూరిటీ సిబ్బంది పక్కకు నెట్టివేసిన సంఘటన ఆ రోజు తనకు తెలియదని అతనితో చెప్పారు. ఆ అభిమానిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. అతనితో కొంత సమయం గడిపి, ఫొటోలు దిగారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జరిగిన సంఘటన పట్ల మీ ప్రవర్తన హుందాగా ఉంది, 'మీరు రియల్ హీరో సార్' అంటూ నెటిజన్లు నాగార్జునను అభినందిస్తున్నారు.

ఈ తల్లి శాపం తగిలి తీరుతుంది

● ట్రోలర్స్‌పై మండిపడ్డ రేణూదేశాయ్



తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని మీమ్స్‌తో ట్రోల్ చేస్తున్నవారిపై నటుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాజీ భార్య, నటి రేణూదేశాయ్ మండిపడ్డారు. ఏపీ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత జనసేనాని పవన్ కల్యాణ్ తన శ్రీమతి అన్నా లెజినోవా, తనయుడు అకిరానందన్, కూతురు ఆద్యలతో దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ ఫొటోను వాడుకొని కొందరు రేణూదేశాయ్ వ్యక్తిత్వాన్ని తక్కువ చేస్తూ రకరకాల మీమ్స్ రూపొందించారు. పవన్ కల్యాణ్‌తో విడాకులు తీసుకొని పొరపాటు చేశారనీ, అదృష్టాన్ని కాలదన్నుకున్నారనీ రకరకాల వ్యాఖ్యలతో మీమ్స్ పెడుతున్నారు. అవి తమను ఎంతగానో బాధపెడుతున్నాయని రేణూదేశాయ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. 'మనుషులు ఇంత దారుణంగా దిగజారడం సిగ్గు చేటు. నాపై వస్తున్న విమర్శలు, నన్నుఎగతాళి చేస్తున్న తీరు చూసి నా కూతురు ఆద్య కన్నీరు పెట్టుకుంది. మీమ్స్ చేసేవాళ్లంతా గుర్తుంచుకోండి, మీకూ ఓ కుటుంబం ఉంటుంది, తల్లులూ, అక్కచెల్లెళ్లు ఉన్నారు. మాపైన జోక్స్ చేస్తున్నవాళ్లకు ఈ తల్లి శాపం తగిలి తీరుతుంది. నా బిడ్డ కార్చిన కన్నీరు, ఊరకే పోదు. ఈ తల్లి శాపం తగిలితీరుతుంది. దీన్ని పోస్ట్ చేసేముందు వంద సార్లు ఆలోచించాల్సి వచ్చింది. కానీ తప్పలేదు' అని రేణూదేశాయ్ తన ఇన్‌స్టా పోస్ట్‌లో పేర్కొన్నారు.


నవ్య | చిత్రజ్యోతి

అరుదైన గౌరవం



'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంతో ఆస్కార్ వేదికపై తెలుగు సినిమా సత్తా చాటారు దర్శక ధీరుడు రాజమౌళి. అంతే కాదు ఆ సినిమాతో ప్రపంచమంతా తన ప్రతిభకు తగిన గుర్తింపు పొందడంతో పాటు 'నాటు నాటు' పాటకు ఆస్కార్ సాధించారు. తాజాగా ఆస్కార్ అకాడెమీలో చేరేందుకు ఆహ్వానం అందుకొని అరుదైన గౌరవం పొందారు. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పని చేసిన రమా రాజమౌళి కూడా ఈ గౌరవంలో భాగమయ్యారు. ఈ ఏడాది 57 దేశాల నుంచి మొత్తం 487 మంది కొత్త సభ్యులకు ఆస్కార్ అకాడెమీ ఆహ్వానం పంపింది. వీరిలో రాజమౌళి, రమతో పాటు భారతీయ చిత్ర పరిశ్రమ నుంచి షబానా అజ్మీ, రితేశ్ సిద్వానీ, రవి వర్మన్, రీమా దాస్, ఆనంద్‌కుమార్ టక్కర్ , నిషా పహుజా, హేమల్ త్రివేది, గితేష్ పాండ్యా ఉన్నారు. ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'నాటు నాటు ' పాటకు ఆస్కార్ అవార్డ్ సాధించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం టీమ్‌లో జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, కీరవాణి, చంద్రబోస్, సెంథిల్‌కుమార్, సాబు శిరిల్‌కు ఆస్కార్ అకాడెమీ కొత్త సభ్యులుగా గత ఏడాది ఆహ్వానం అందింది.

యాక్షన్‌ఎంటర్‌టైనర్



అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బడ్డీ'. గాయత్రి భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లు. శామ్ ఆంటోన్ దర్శకత్వంలో జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జూలై 26న విడుదల కానుంది. మంగళవారం సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ 'నేను కథ కంటే శామ్‌నే ఎక్కువగా నమ్మాను. అల్లు శిరీష్ మా కుటుంబ సభ్యుడు. 'బడ్డీ'లో ఆయన నటన అందరినీ ఆకట్టుకుంటుంది' అని చెప్పారు. 'నేను రాజమౌళిగారి అభిమానిని. ఆయన తీసిన 'ఈగ' చిత్రం ఈ 'బడ్డీ'కి ప్రేరణ. సీజీ వర్క్ చేస్తున్నప్పుడు 'ఈగ' మూవీతో పోల్చి సజెషన్స్ ఇచ్చేవాడిని' అన్నారు దర్శకుడు శామ్. హీరో అల్లు శిరీష్ మాట్లాడుతూ 'ఇది కొత్త తరహా సినిమా ఇందులో హీరో నేను కాదు.. టెడ్డీ బేర్. ఆ క్యారెక్టర్‌కు ఇంప్రెస్ అయి ఈ సినిమా ఒప్పుకొన్నా. మా నాన్న కూడా నా మీద ఇంత ఖర్చు పెట్టి సినిమా తీయలేదు. భారీ ఖర్చుతో నాతో యాక్షన్ అడ్వెంచర్ తీసిన జ్ఞానవేల్ రాజాగారికి కృతజ్ఞతలు' అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/glCv1r4 లో చదవండి.

పది సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

కలెక్టరేట్: పదో తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలను విద్యాశాఖ బుధవారం విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా బాలురు 1727 మంది, బాలికలు 1021 మంది మొత్తం 2748 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. జిల్లా వ్యాప్తంగా 62.26 శాతం ఉత్తీర్ణత సాధించారు. పరీక్ష రాసిన వారిలో బాలురు 1052 మంది, బాలికలు 659 మంది మొత్తం 1711 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలురు 60.91 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 64.54 శాతంఉత్తీర్ణత సాధించారు.

కంటి వైద్య శిబిరం

లక్కవరపుకోట, జూన్ 26: జమ్మాదేవిపేట వద్ద గల పాల్ మెమోరియల్ చర్చి వద్ద బుధవారం జరిగిన కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి స్పందన లభించింది. 65 మంది పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు తీసుకున్నారు. 22 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఫౌండేషన్ అధినేత డి.డానియేల్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహించారు.

బోగస్ పింఛన్లపై విచారణకు డిమాండ్

జామి: రామయ్యపాలెం గ్రామంలో గతంలో ఇచ్చిన పింఛన్లలో అవినీతి జరిగిందని, కలెక్టర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని.. అర్హులకు అందించాలని మండల టీడీపీ నాయకుడు ఎం.సూర్యారావు కోరారు. తమ పంచాయతీ పరిధిలో చాలా మంది తప్పుడు సదరం పత్రాలతో పింఛన్లు పొందారని వివరించారు. వాటిపై జిల్లా స్థాయి అధికారులు దర్యాప్తు చేస్తే అవినీతి భాగోతం బయట పడుతుందని అన్నారు.

29న బియ్యం వేలం

కొత్తవలస: మండలంలోని వివిధ ప్రాంతాలలో పట్టుబడిన 102.72 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఈ నెల 29న మధ్యాహ్నం 3 గంటలకు కొత్తవలసలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద వేలం వేయనున్నట్టు సీఎస్ డీటీ కె.ఇందిర తెలిపారు. ఆసక్తి కలవారు కొత్తవలసలోనున్న ఎంఎల్ఎస్ పాయింట్‌కు వెళ్లి బియ్యాన్ని పరిశీలించవచ్చని తెలిపారు.

ట్రస్టుకు విద్యార్థుల విరాళం

కొత్తవలస: తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలోనున్న ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టుకు దెందేరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.12 వేల నగదు, వస్త్రాలను సేకరించి అందజేసినట్టు ట్రస్టు చైర్మన్ వి.హరికుమార్ తెలిపారు. తమ ట్రస్టు ద్వారా ప్రతి నెలా 42 మంది వృద్ధులకు 12 రకాలైన నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగ్యూపై అవగాహన

కొత్తవలస: మలేరియా, డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ విద్యార్థులకు సూచించారు. మలేరియా నివారణా మాసోత్సవాల సందర్భంగా బుధవారం వియ్యంపేటలోని బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల, జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీ, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సాంబశివరావు, వైద్య సిబ్బంది నరసింహారావు, ఈశ్వరరావు, ఆప్తమాలిక్ అసిస్టెంట్ ఈశ్వరరావు, సత్యారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను రక్షించుకుందాం

జామి: ప్రభుత్వ బడులను రక్షించుకుందామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీఆర్‌కే ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రాజారావు ఆధ్వర్యంలో బుధవారం కరపత్రాలు పంచిపెట్టారు. అనంతరం వీరు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 117ను రద్దు చేసి పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలు నిర్వహించాలన్నారు. వాసుదేవరావు, తాతంనాయుడు, జనార్దన రావు, ముత్యాలు, అప్పలరాజు, రామలింగేశ్వరరావు ఉన్నారు.

కాలబైరవ స్వామికి పూజలు

కొత్తవలస: చింతలపాలెం గ్రామంలోని కాలబైరవ స్వామికి మంగళవారం రాత్రి పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కాలబైరవస్వామి పండగ మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చింతలపాలెం సర్పంచ్ మాకెన సీతారామపాత్రుడు మాడుగుల శాసన సభ్యుడు బండారు సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్, విశాఖ పార్లమెంటరీ నియోజక వర్గ బీసీసెల్ అధ్యక్షుడు తమ్మిన విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో హాజరు కావాలి

వేపాడ: ఉపాధ్యాయులు పాఠశాలలకు సకాలంలో హాజరు కావాలని మండల విద్యాశాఖాధికారి జగదీశ్వర రావు అన్నారు. ఒబలయ్యపాలెం ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇయర్ ప్లాన్, స్కూల్ టైం టేబుల్, లెసన్ ప్లాన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

హార్టికల్చర్ అభివృద్ధికి కృషి

రామభద్రపురం: ఈ సీజన్‌లో హార్టికల్చర్ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని జాతీయ ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ జనార్దన్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మొక్కలు పెద్ద ఎత్తున నాటాలని కోరారు. ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఏపీవో జి.త్రినాథరావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుడు ఛత్రపతి సాహు

విజయనగరం దాసన్నపేట: మహనీయుడు, రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహరాజ్ అని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు అన్నారు. బుధవారం సాహు మహరాజ్ 150వ జయంతి వేడుకలు కంటోన్మెంట్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ అంబేద్కర్ చదువు నిమిత్తం ఆర్థిక సాయం చేసి ఆయన మేధస్సుని ప్రజలకు అందించడానికి ప్రయత్నించిన గొప్ప వ్యక్తి సాహు మహరాజ్ అని కొనియాడారు. బీఎస్పీ నాయకులు ఆర్జి శివప్రసాద్, పైడిరాజు, యయూఎం ప్రకాష్‌రావు, కిరణ్ పాల్గొన్నారు.

వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు

విజయనగరం రింగురోడ్డు: అన్ని జాగ్రత్తలతో వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు నిర్వహించామని నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి తెలిపారు. బుధవారం కొత్తపేటలోని స్టైరిలేజేషన్ సెంటర్‌లో కుక్కలకు నిర్వహిస్తున్న శస్త్ర చికిత్సలు, యాంటీ రేబిస్ టీకాల విధానాన్ని కమిటీ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. పశు సంవర్ధక, జంతు సంక్షేమ, ప్రజారోగ్య శాఖలు, బ్లూక్రాస్ సంయుక్త పర్యవేక్షణలో కుక్కలకు వ్యాధి నిరోధక, సంతానోత్పత్తి నిరోధక శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయన్నారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ పి.మోహన్, బ్లూ క్రాస్ ప్రతినిధి సోంబాబు, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

రాజాం: సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం కంచరాం, రాజీయ్యపేట సచివాలయాలను తనిఖీ చేశారు. ప్రతి రోజు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సిబ్బంది ఎవరైనా క్షేత్రస్థాయికి వెళితే మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.

చంద్రబాబు పాలనతో సామాజిక న్యాయం

● భారీ గజమాలతో కోండ్రుకు స్వాగతం



భారీ గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు

రాజాం, జూన్ 26: ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత మొదటిసారిగా రాజాం చేరుకున్న కోండ్రు మురళీమోహన్‌కు బుధవారం నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. సుమారు 500 వాహనాలతో విజయనగరం జిల్లా చింతలవలస చేరుకున్న అభిమానులు స్వాగతం పలికి అక్కడ నుంచి ర్యాలీగా రాజాం చేరుకున్నారు. భారీ గజమాలతో కోండ్రును సత్కరించారు. అడుగడుగునా పులవర్షం కురిపించారు. ముందుగా చీపురుపల్లి రోడ్డులో ఉన్న అభయ అంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రచార రథంపై ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న నవదుర్గ అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు హయాంలో రాబోయే ఐదేళ్లలో సంక్షేమం. అభివృద్ధికి పెద్దపీట వేస్తారన్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మెయిన్ రోడ్డులో అభిమానులు భారీ గజమాల వేశారు. ఈ కార్యక్రమంలో రాజాం అర్బన్ పట్టణ అధ్యక్షుడు నంది సూర్య ప్రకాష్ రావు, రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల నాయకులు అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పిరిడి హైస్కూలులో డిప్యూటీ డీఈవో విచారణ



విచారణ చేస్తున్న డిప్యూటీ డీఈవో మోహనరావు

బొబ్బిలి: పిరిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహణ తీరుపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై బుధవారం డిప్యూటీ డీఈఓ కె.మోహనరావు, ఇద్దరు ఎంఈఓలు చల్లా లక్ష్మణరావు, గొట్టాపు వాసులు విచారణ చేపట్టారు. తొలుత పాఠశాలలో హెచ్ఎం మధుసూదనరావు, సిబ్బంది, భోజన నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించి ఆరా తీశారు. వంటగ్యాస్ మధ్యలో అయిపోవడంతో రెండుసార్లు వంట వండాల్సి వచ్చిందని, ఆ కారణంగానే తొలివిడతలో కొంతమంది విద్యార్థులకు భోజనం అందలేదని నిర్వాహకులు వివరణ ఇచ్చారు. ఎప్పుడూ ఇలాంటి సమస్య రాలేదని హెచ్ఎం సంజాయిషీ ఇచ్చారు. అనంతరం వంటలను, తయారుచేసిన భోజనాలను డిప్యూటీ డీఈవో పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు సరిపడా సక్రమంగా అందించాలని హెచ్ఎంను, భోజన నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం సుమారు 60 మంది విద్యార్థులకు భోజనం అందకపోయిన అంశానికి సంబంధించి రెండురోజుల్లోగా వివరణ ఇవ్వాలని హెచ్ఎంకు, నిర్వాహకురాలికి నోటీసులు జారీ చేసినట్లు డిప్యూటీ డీఈఓ తెలిపారు. నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి సమర్పిస్తామని ఆయన తెలిపారు.

నూతన కలెక్టర్‌ని కలిసిన ఎస్పీ దీపిక



అంబేద్కర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైం/కలెక్టరేట్, జూన్ 26: జిల్లా కలెక్టరుగా బాధ్యతలు చేపట్టిన డాక్టరు బీఆర్ అంబేద్కర్‌ని జిల్లా ఎస్పీ దీపికా బుధవారం కలెక్టరు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెతో పాటు అదనపు ఎస్పీ ఆస్మాపరహీన్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు సంబంధించిన శాంతిభద్రతలు తదితర వాటిపై చర్చించారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం: బొద్దాం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీ ఫణీంద్ర కుమార్, ఏఈ వావిలిపల్లి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

గురుకులంలో డిజిటల్ లైబ్రరీ



పాఠశాల రికార్డులను తనిఖీ చేసి సంతకం చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

లక్కవరపుకోట, జూన్ 26: జమ్మాదేవిపేట వద్దగల మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలకు సాహసం ఫౌండేషన్ చైర్మన్ మాచవరపు గణేష్ డిజిటల్ లైబ్రరీని వితరణ చేశారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల ఉన్నత విద్య కోసం చంద్రబాబు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో, ఎంజేపీ జిల్లా కన్వీనర్ రమామోహిని, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, జీఎస్ నాయుడు, కొల్లు రమణమూర్తి, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.


సీబీఎం హైస్కూలు అన్యాక్రాంతమైతే సహించం



మాట్లాడుతున్న కరస్పాండెంట్ రత్నకుమార్

బొబ్బిలి: బొబ్బిలి పట్టణ నడిబొడ్డున ఉన్న చరిత్రాత్మకమైన సీబీఎం బాలికల ఎయిడెడ్ ఉన్నత పాఠశాలను అన్యాక్రాంతం చేసినా, తరలించినా సహించేది లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు, సీబీసీఎన్‌సీ ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం పాఠశాలలో కరస్పాండెంట్ ఎం.రత్నకుమార్ అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రుల తరఫున సీపీఎం నాయకుడు పి.శంకరరావు, ఎస్ఎఫ్ఐ నాయకుడు మణి, సీబీసీఎన్‌సీ అధ్యక్షుడు అదృష్టకుమార్, సీబీఎం చర్చి అధ్యక్షుడు జి.వేణు అక్కడికి చేరుకొని పాఠశాల మనుగడపై ఆందోళన వ్యక్తం చేశారు. కరస్పాండెంట్‌తో వాగ్వాదానికి దిగారు. పాఠశాల గుర్తింపును రెన్యూవల్ చేయాలని, విద్యార్థులను చేర్పించే బాధ్యత తాము తీసుకుంటామని వారంతా భరోసా ఇచ్చారు. దీనిపై కరస్పాండెంట్ రత్నకుమార్ బదులిస్తూ ఈ హైస్కూలును ఇక్కడే నిర్వహించి అభివృద్ధి చేస్తామని, గుర్తింపును రెన్యూవల్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఐదెకరాలకు పైగా అన్యాక్రాంతమైందని తెలిపారు. ఈ ఆస్తుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో హెచ్ఎం సునేత్రి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలని డిమాండ్



నినాదాలుచేస్తున్న దృశ్యం

బొబ్బిలి: వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కార్మికులు సమ్మె చేసిన సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని.. చంద్రబాబు ప్రభుత్వం వాటిని పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. సానిక మున్సిపల్ మేనేజర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు సంక్రాంతికి రూ.వెయ్యి బోనస్, రెండు నెలల మెడికల్ అలవెన్స్ వంటివి చెల్లిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా గద్దె దిగిపోయారన్నారు. టీడీపీ గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని శంకరరావు కోరారు. కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఈ కార్యక్ర మంలో యూనియన్ అధ్యక్షుడు గౌరీశ్, రామరావు, వెంకటి తదితరులు పాల్గొన్నారు. ● సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సహారా ఇండియా బాధితులందరికీ కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని శంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం మహారాణిపేటలో జరిగిన సహారా ఏజెంట్లు, ఇన్వెస్టర్ల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘ నాయకుడు బొంతలకోటి దాసు తదితరులు పాల్గొన్నారు.

నందివానివలసలో ఏనుగులు



నందివానివలస తామర చెరువులో సేద తీరుతున్న ఏనుగులు

గరుగుబిల్లి, జూన్ 26: తోటపల్లి పంచాయతీ నందివానివలసలో ఏనుగులు సంచరిస్తున్నాయి. దీంతో స్థానికులు హడలెత్తిపోతున్నారు. మంగళవారం అనారోగ్యంతో ఆడ ఏనుగు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రాంతంలో సంచరించే ఏడింటిలో ఒకటి చనిపోవడంతో మిగిలిన ఆరు ఏనుగులు దిగులుగా ఉన్నాయి. ప్రస్తుతం అవి నందివానివలస సమీపంలోని తామర చెరువులో సేద తీరుతున్నాయి. కాగా గుంపులో ఒక ఏనుగు మృతి చెందడంతో మిగిలిన గజరాజులు ఏ నిమిషంలో ఏం చేస్తాయోనని పరిసర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖాధికారులు, ట్రాకర్స్ ఏనుగులపై దృష్టి సారించి.. వాటిని ఈ ప్రాంతం నుంచి తరలించే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అశోక్ పుట్టిన రోజు వేడుకలు




నిరాశ్రయుల గృహంలో వృద్ధులకు అల్పాహారం అందిస్తున్న ఎంపీజీ ఈశ్వరరావు

విజయనగరం రూరల్: అశోక్ గజపతిరాజు పుట్టిన రోజుని పురస్కరించుకుని బుధవారం విజయనగరంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో అశోక్ గజపతి రాజుకి ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు ప్రసాదుల రామకృష్ణ, ప్రసాదుల కనకమహాలక్ష్మీ, నగర పార్టీ అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుయువత నాయకుడు పీతల కోదండరామ్ రక్తదానం చేశారు. **విజయనగరం దాసన్నపేట:** టీడీపీ సీనియర్‌నేత, కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతిరాజు పుట్టిన రోజు పురస్కరించుకుని నగర నిరాశ్రయుల గృహంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్షులు ఎంపీజీ ఈశ్వరరావు ఆధ్వర్యంలో అల్పాహారం అందించారు. టీడీపీ నాయకులు కాళ్ల గౌరీశంకర్, గాదు అప్పారావు, శిష్టకరణ సంఘం ప్రతినిధులు వెంకటేష్, సంజీవరావు, మధుసూధనరావు, ఎంపీ తిరుపతిరావు, త్యాడ ప్రసాద్‌పట్నాయక్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ● **విజయనగరం రింగురోడ్డు:** స్థానిక కోట ప్రాంగణంలో మాన్సాస్ విద్యా సంస్థలు, ఎన్‌సీసీ వలంటీర్లు, ఎన్‌సీసీ కేడేట్లతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ● కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజుకు నాయకులు సువ్వాడ రవిశేఖర్, సువ్వాడ వనజాక్షి, కడగల ఆనంద్‌కుమార్, గేదెల రాజారావు తదితరులు ఆయన నివాసంలో బుధవారం సాయంత్రం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ● **విజయనగరం (ఆంధ్రజ్యోతి):** అశోక్ గజపతి రాజు జన్మదిన వేడుకలు పురష్కరించుకుని బుధవారం టీడీపీ నాయకులు విజయ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సింహాచలం, పైడితల్లి అమ్మవారి దేవస్థానం వేద పండితులు దీవెనలు అందించారు. అనంతరం అవనాపు విజయ్, భార్గవి దంపతుల ఆధ్వర్యంలో పూల్‌బాగ్ కాలనీలో ఉన్న ప్రభుత్వ బదిరిల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు, బంగ్లాలో అశోక్ చేతులుమీదుగా వాషింగ్ మిషన్, మిఠాయిలు పంపిణీ చేశారు. ● అశోక్ గజపతి రాజుకు శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి బుధవారం విజయనగరంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రైవేటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణ పరిధిలో అనుమతులు, మౌలిక సదుపాయాలు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్.ఎఫ్.ఐ. మండల శాఖ డిమాండ్ చేసింది. బుధవారం ఎంఈఓ నర్సింగరావుకు వినతిపత్రం అందించారు. కొన్ని పాఠశాలలు అనుమతులు లేకుండా విద్యార్థులను చేర్పించుకుంటున్నాయని తెలిపారు. వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఎస్.ఎఫ్.ఐ. నాయకులు నాగచైతన్య, చరణ్, అను, రత్న తదితరులు పాల్గొన్నారు.

నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే అదితి



ఆర్టీసీ బస్సులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రింగురోడ్డు, జూన్ 26: విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బుధవారం రెండు నూతన సూపర్ లగ్జరీ బస్సులను ఎమ్మెల్యే అదితి గజపతి రాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రజా రవాణాధికారి అప్పలనారాయణ మాట్లాడుతూ ఈ రెండు బస్సులు విజయనగరం- విజయవాడ మధ్య తిరుగుతాయన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజరు శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగని ఆక్రమణలు

● అడ్డుకున్న అధికారులు

బొబ్బిలి, జూన్ 26: చెరువులు, కాలువల్లో ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతూనే ఉన్నాయి. పాతబొబ్బిలి భైరిసాగరం చెరువు గర్భంలో యంత్రాలతో చదును చేస్తుండగా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు బుధవారం అడ్డుకున్నారు. భైరిసాగరం చెరువు గర్భంలో తమ ప్లాటు ఉందని చెబుతూ కొంతమంది వ్యక్తులు గట్టును యంత్రాలతో తవ్వుతున్నారు. దీనిపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. జగన్నాథపురంలో పంట కాలువను మరి కొంతమంది చదును చేశారు. దీనిపై కూడా స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు అక్కడికి చేరుకుని పనులను నిలుపుదల చేశారు. తారకరామా కాలనీలో ఇంటి నిర్మాణాల కోసం అక్రమంగా రాత్రివేళల్లో గ్రావెల్ రవాణా చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. అధికారులు వెళ్లడంతో వాహనదారులు అక్కడి నుంచి జారుకున్నారు.



పాతబొబ్బిలి చెరువుగర్భంలో జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

కాలుజారి పడి పెయింటర్ మృతి

బాడంగి, జూన్ 26: పెయింటింగ్ వేస్తూ కిందపడి వ్యక్తి చనిపోయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ ఆర్.జయంతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెరకముడిదాం మండలం చినమత్రిపేట గ్రామానికి చెందిన రాగోలు మహేష్(38) పెయింటర్‌గా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని గజరాయనివలస గ్రామంలోని ఓ ఇంటికి పెయింటింగ్ వేసేందుకు బుధవారం వచ్చాడు. ఇలా పెయింట్ వేస్తుండగా బుధవారం సాయంత్రం కాలుజారి పైనుంచి కిందకు పడిపోయాడు. ఈ ఘటనలో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మహేష్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..

రామభద్రపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం సాయంత్రం స్కూటీపై వస్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న ఒక గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మృతుని వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రాజాం రూరల్: మున్సిపాలిటి పరిధిలోని గోపాలపురం రోడ్‌లో బుధవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. కొత్తవలస గ్రామానికి చెందిన నారాయణరావు, గోపాలపురం గ్రామానికి చెందిన ధనుంజయ, గణేష్ గాయాలపాలైన వారిలో ఉన్నారు. గాయపడిన ముగ్గురికి 108 వాహనంలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంకా దీనిపై కేసు నమోదు కావాల్సి ఉంది.

పిడుగుపాటుకు గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

రేగిడి, జూన్ 26: పిడుగుపడి గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సంకిలి గ్రామానికి చెందిన ఇప్పిలి రాంబాబు, ఆయన సోదరుడు వెంకటరమణ గొర్రెలు పెంచుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సంకిలి-దేవుదళ సరిహద్దుపొలాల్లో బుధవారం సాయంత్రం గొర్రెల మందను మేపిస్తున్నారు. ఇంతలో ఉరుములు, మెరుపులతో వర్షం వచ్చి, భారీశబ్దంతో పిడుగుపడింది. ఈ ప్రమాదంలో గొర్రెలమందకు సమీపంలో వేరేచోట మేస్తున్న నాలుగు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. ఘటనాస్థలానికి కొద్దిదూరంలో ఉన్న గొర్రిల కాపరి రాంబాబు స్వల్ప అస్వస్థతకు లోనయ్యాడు. ఈయనకు ఎటువంటి ప్రాణహాని లేకపోవటం కుటుంబీకులు ఊపిరి పీల్చుకొన్నారు. ఈ ఘటనలో రూ. 50వేలు విలువచేసే గొర్రెలు మృతి చెందడంతో బాధిత కుటుంబం కన్నీరుమున్నీరైంది. పిడుగుపాటు సమాచారాన్ని వీఆర్వో గోపాల్‌నాయుడు స్థానిక రెవెన్యూ కార్యాలయానికి తెలియజేశారు.

ఈదురు గాలలకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం



పడిపోయిన విద్యుత్ స్తంభం

రాజాం: ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో కుర్సిన భారీ వర్షానికి అగ్నిమాపక కేంద్రం వెనుక భాగంలో టేకు చెట్టు విద్యుత్ స్తంభంపై విరిగి పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది హుటాహుటిన చెట్టును తొలగించేలా చర్యలు చేపట్టారు. దీని కారణంగా పురపాలక సంఘం పరిధిలోని వస్త్రపురికాలనీకి మాత్రమే విద్యుత్ సరఫరా ఉండదని ఏడీ తెలిపారు. లైన్ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి ఆధ్వర్యంలో తగిన చర్యలు తీసుకుని కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరా పుణరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

వీసీపై జుడీషియల్ ఎంక్వైరీ చెయ్యాలి



మాట్లాడుతున్న రమణమూర్తి

విజయనగరం(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ(జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ) - గురజాడ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆచార్య వెంకట సుబ్బయ్య వైసీపీ, మాజీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యానారాయణకు వీరవిధేయుడిగా పనిచేస్తూ, యూనివర్సిటీలో అనేక ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారని ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి ఆరోపించారు. వీసీని వెంటనే సస్పెండ్ చేసి, అతనిపై న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీసీ వెంకట సుబ్బయ్యపై ఎన్నో ఆరోపణలు ఉన్నా 2023 సంవత్సరం ఫిబ్రవరిలో అప్పటి మంత్రి బొత్స సత్యానారాయణ ఈయనని ఏరీ కోరి విజయనగరం జెఎన్టీ యూ వీసీగా నియమించారన్నారు. యూనివర్సిటీలో రూ.20 కోట్లతో మంజూరై నిర్మిస్తున్న పరిపాలన భవన నిర్మాణాల్లో కనీస నాణ్యాత ప్రమాణాలు పాటించలేదని విమర్శించారు. యూనివర్సిటీలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి కమీషన్‌లు తీసుకుంటున్నారని, ఇందులో భాగంగానే పరిపాలన భవణ నిర్మాణాల పనులు చేస్తున్న కాంట్రాక్టు వద్ద రూ. 2 కోట్లు తీసుకున్నారని ఆరోపించారు. వీసీ వెంకట సుబ్బయ్యను విధుల్లోంచి తొలగించి, వెంటనే ఆయనపై న్యాయవిచారణ జరపాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీసీ వెంకటసుబ్బయ్య బాధితులు సంతోష్, రవీంద్ర కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్డవరలో మలేరియా మాసోత్సవ ర్యాలీ

శృంగవరపుకోట రూరల్: బొడ్డవర గ్రామంలో కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష ఆధ్వర్యంలో బుధవారం మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మీనా, ఉపసర్పంచ్ శ్రీరాములు, దారపర్తి సర్పంచ్ సన్యాసిరావు, గ్రామపెద్దలు బుద్దరాజు మురళీరాజు, డాక్టర్ మానస తదితరులు పాల్గొన్నారు.

29న మెగా జాబ్‌మేళా

రాజాం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఆరు ప్రముఖ కంపెనీలతో ఈనెల 29న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 28 ఏళ్ల లోపు వయస్సు, ఐటిఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 8121450657, 9573574643 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సీతంపేటలో..

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఏపీవో వెంకట గణేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమేజాన్, కేఎల్ గ్రూప్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని, ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఈ 93929 17696 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

చేయూత డబ్బులు అందించండి

కలెక్టరేట్, జూన్ 26: అర్హులైన మహిళలు అందరికీ చేయూత డబ్బులు అందేలా చూడాలని గుర్ల మండలం కెల్ల గ్రామానికి చెందిన మహిళలు రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు బుధవారం విన్నవించారు. గ్రామంలోని చాలా మంది అర్హులైన మహిళలకు చేయూత డబ్బులు అందలేదని... దీనిని పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తామని మంత్రి చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

బొబ్బిలి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఆర్డీఓ పి.మురళీకృష్ణ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. తహసీల్దార్లు త్రినాథరావు నాయుడు, సులోచనారాణి, రాజారావు, మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, ఎంపీడీఓ రవికుమార్, వైద్యాధికారులు, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయచంద్ర

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

● కబ్జాదారుల కోరలు పీకేస్తాం ● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: పార్వతీపురం నియోజకవర్గంలో అధికారాన్ని అడ్డంగా పెట్టుకొని వైసీపీ హయాంలో ప్రభుత్వ భూమిని కాజేసి కోట్లాది రూపాయలు సంపాదించిన కబ్జాదారుల కోరలను రికార్డుల ప్రకారం పీకేస్తామని ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం బుధవారం నియోజకవర్గానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విజయచంద్రకు సీతానగరం, పార్వతీపురం, బలిజిపేట మండలాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. విజయనగరం నుంచి పార్వతీపురం వరకు సుమారు వంద కార్లతో ర్యాలీగా సీతానగరం మండలంలోని లచ్చయ్యపేట వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి పార్వతీపురం పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వకాలంలో ప్రభుత్వభూములను కబ్జాచేసి కోట్లాది రూపాయలను సంపాదించినవారిభరతం పడతాన్నా రు. రికార్డులు ప్రకారం భూమిని పరిశీలించి ప్రభుత్వభూమిని కాపాడుతానన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, సంధ్యారాణి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భానుదేవి చంద్రమౌళి, బార్నాల సీతారాం, కె.నారాయణరావు, గొట్టాపు వెంకటనాయుడు, వెంకి, వేణుగోపాలనాయుడు, డాక్టర్ భద్రీ, నారాయణ, బోను దేవి చంద్రమౌళి, పెంట సత్యం, రౌతు వేణు, బెలగాం జయప్రకాష్, నా రాయణ, మజ్జి వెంకటేష్, జి.రవికుమార్, పి.రాజశేఖర్, జాగాన రవి,కందుకూరి ప్రభాకరావు, వై.నిర్మలా కుమారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, మండలాధ్యక్షుడు సంజయ్ మాస్టార్, జనసేన నాయకులు అనీల్ పాల్గొన్నారు.

● **సీతానగరం:** విజయ్‌చంద్రకు లచ్చయ్యపేట వద్దమండల నాయకులుస్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాల హరిగోపాల్, దామినేని భాను ప్రసాద్, పెంట సత్యంనాయుడు రౌతు వేణుగోపాల్ నాయుడు పాల్గొన్నారు.

సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తాం

● ప్రజాప్రతినిధులు మధ్యలో వెళ్లిపోవడం సంస్కారం కాదు

● కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

జియ్యమ్మవలస: నియోజకవర్గంలో ఎక్కడ ఎటువంటి సమస్య ఉన్నా ఆ ప్రాంత ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే ప్రయత్నం చేస్తానని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బొంగు సురేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆమె వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ ఉపాధి వేతనదారులకు ప్రభుత్వం ఇస్తున్న డబ్బులు ఎవరికీ ఇవ్వనవసరం లేదని, ఒకవేళ ఎవరైనా అడిగితే వారిని నిలదీయాలన్నారు. ఎంపీపీ సురేష్ మాట్లాడుతూ మండలంలో వివిధ శాఖల్లో పనిచే స్తున్న అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే ఉండాలని, లేదంటే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలన్నారు. రెండున్నరేళ్ల మీ పనితీరు మండలం అధోగతి పాలయ్యిందని మండి పడ్డారు. సమావేశం మధ్యలో వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, మరికొందరు వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వెళ్లిపోవడంపై ఎమ్మెల్యే జగదీశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతిని ధులుగా ఎన్నో ఆశలు పెట్టుకొని ప్రజలు మిమ్మల్ని గెలిపించారని, అటువంటి ప్రజాప్రతినిధులు సమావేశ మందిరంలో ఉండి మీ పరిధి సమస్యలు తెలిపి పరిష్కరించువాలన్నారు. అంతేకాని మధ్యలో వెళ్లిపోవడం సంస్కారం కాదని హితవుపలికారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వాడివేడి చర్చ జరిగింది. ఉపాధి హామీపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహిస్తున్నప్పుడు ఏపీవో శ్రీనివాసరావు చెబుతున్న నివేదిక, సమాధానాలపై ఎంపీపీ సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో ఉపాధి హామీ పనుల్లో 90 శాతం అవినీతిలో ఉందని, వెలుగుశాఖ పనితీరు మరింత అధ్వానంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవో-1 నాగభూషణరావు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో లిఖిత పూర్వకంగా ఇవ్వాలని ఎమ్మెల్యే జగదీశ్వరి తెలియ జేశారు. వీటిని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



మాట్లాడుతున్న గుమ్మిడి సంధ్యారాణి

అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదు

● గిరిజన, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

సాలూరు: నియోజవకవర్గ అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రశక్తే లేదని గిరిజన, మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. బుధవారం సాలూరులో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెంచిన పింఛన్ కార్యక్రమం లో నాయకులంతా హాజరుకావాలని కోరారు.మీ ఇంటి పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచారన్నారు. జూలై ఒకటో తేదిన పెంచిన పింఛన్లు వలంటీర్లతో కాకుండా సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుతో ప్రతి ఒక్కరి భూమివారి సొంతమేనన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కానుండడంతో అర్హతఉన్న ప్రతి ఒక్కరూ పరీక్షకు సిద్ధం కావాలని కోరారు.త్వరలో సాలూరులో అన్న క్యాంటీన్ ఏర్పాటుచేస్తామని తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాధ్యక్షులతోపాటు టీడీపీ, బీజేపీ,జనసేన నాయకులు పాల్గొన్నారు. కాగా మంత్రికి జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజు, డిప్యూటీ సీఈవో రాజ్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు, నాయకులు అభినందించారు.



పాలకొండ: మత్తు పదార్థాలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



సాలూరు రూరల్:మామిడిపల్లిలో ..



జియ్యమ్మవలస:చినమేరంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు



గుమ్మలక్ష్మీపురం: మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న పోలీసులు

దురలవాట్లకు యువత దూరంగా ఉండాలి

● *అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు*

విద్యార్థులు, యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన, అక్రమరవాణావ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని పోలీసులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. -ఆంధ్రజ్యోతి బృందం



సాలూరు: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



గరుగుబిల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు



సీతంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



సీతానగరం: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్



కొమరాడ: మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలకంఠం



పాచిపెంట: విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

లోకేష్ దృష్టికి కురుపాం సమస్యలు

కురుపాం: కురుపాం నియోజకవర్గం సమస్యలు, అభివృద్ధి గురించి ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో చర్చించినట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ తెలిపారు.ఈ మేరకు బుధవారం నారా లోకేష్‌ను కలిశారు.

మంత్రిని కలిసిన విజయవాంకుశం

గరుగుబిల్లి: రాష్ట్ర చిన్న, మధ్యతరహా, సర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును అరకు టీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి ముదిలి విజయవాంకుశం బుధవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

నేడు డీలర్ల సమావేశం

పాలకొండ: శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లా రేషన్ డీలర్ల సమస్యలపై రాష్ట్ర డీలర్ల సమావేశం గురువారం జరగనుంది. రాష్ట్ర డీలర్ల సంఘ అధ్యక్షుడు లీలామాధవరావు ఆధ్వర్యంలో పట్టణంలోని అన్నవరం రోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపంలో సమావేశం జరుగుతుందని సంఘ ఉపాధ్యక్షుడు సుంకరి సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎగ్జిబిషన్ నిర్వహణకు వేలం

పాలకొండ:పట్టణంలోని జగన్నాథ రథయాత్ర మహోత్సవాలు జూలై 7 నుంచి 17 వరకు నిర్వహించనున్నారు.దేవస్థానంపరిధిలో ఉన్న ఖాళీ ప్రదేశంలో ఎగ్జిబిషన్‌కోసంవేలం పాట బుధవారం నిర్వహించారు.అత్తిలికి చెందిన షేక్ అబ్దుల్లా ఇమ్రాన్‌ఖాన్ 4,20,000కు ఎగ్జిబిషన్ హక్కులు సొంతం చేసుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

జియ్యమ్మవలస: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు.బుధవారం మండలంలోని ఎం.అల్లువాడలో ఏర్పాటుచేసిన మినీ రక్షిత మంచినీటి పథకం ట్యాంకును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్, సర్పంచ్ బొంగు పరిశినాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఏఈఈ భరత్‌చంద్ర పాల్గొన్నారు.

●**గుమ్మలక్ష్మీపురం:** మండలంలోని కానసింగి రహదారిని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండ శిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాల్సిన అవసరముందని, వీటిని పూర్తి చేయడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పాడి సుధ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే జయకృష్ణ రాక

పాలకొండ: ప్రమాణ స్వీకారం తరువాత స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు తొలిసారిగా గురువారరం నియోజకవర్గానికి వస్తున్నారు. ఆయనకు ఘన స్వాగతం పలకాలని, ఈసందర్భంగా తలపెట్టిన ర్యాలీని విజయవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు గండి రామినాయుడు కోరారు.విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు పార్వతీపురం రైల్వేస్టేషన్‌కు జయకృష్ణ వస్తారన్నారు. రైల్వేస్టేషన్ నుంచి ర్యాలీగా ఎం.రాజపురం, అక్కడి నుంచి వీరఘట్టం, పాలకొండ పట్టణాల్లో ర్యాలీ ఉంటుందన్నారు.

చినమేరంగి సీఐకి ఎస్పీ అభినందన

జియ్యమ్మవలస: చినమేరంగి సీఐ బి.మంగరాజుకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు. ఇటీవల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవడంతో అభినందించడంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. చినమేరంగి, జియ్యమ్మవలస, గరుగుబిల్లి ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, సీఐ మంగరాజుకు అభినందించారు.

9న గరుగుబిల్లిలో ప్రజావేదిక: డీఆర్పీ

గరుగుబిల్లి: మండలంలోని 25 పంచాయతీల్లో సామాజిక బృందం గ్రామాల్లో ముమ్మరంగా ఇంటింటా తనిఖీలు నిర్వహిస్తోంది. బుధవారం గొట్టివలసలో డీఆర్పీ బి.శ్రీనివాసరావుతో పాటు పలువురు గతఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు నిర్వహించిన పలు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూలై తొమ్మిదో తేదీన గరుగుబిల్లిలో ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్య క్రమంలో నల్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.ప్రభాకరరావు తెలిపారు. బీఎస్సీ ఆనర్స్, కెమి స్ట్రీ, కంప్యూటర్ సైన్స్, బోటనీ ఆనర్స్, హిస్టరీ, బీకాం కంప్యూటర్ ఆనర్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, గిరిజన విద్యార్థులకు హాస్టల్ సౌక ర్యం ఉందని తెలిపారు.కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ సౌకర్యాలు కూడా ఉన్నాయన్నారు. విద్యార్థులు 9553327138, 9949916966 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు: కలెక్టర్

రాయగడ: మత్తుపదార్థాలు జీవితాన్ని చిత్తు చేస్తాయని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ తెలిపారు. బుధవారం రాయగడ సంస్కృతి భవన్‌లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలనపై జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. తొలుత మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలను తెలియ జేస్తూ స్థానిక కపిలాష్ కూడలి నుంచి ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు దుష్మంత్ మహంతి విష్ణుప్రసాద్ పాత్రో పాల్గొన్నారు.

రాయగడలో బురదల పోలమ్మ అనుపోత్సవం

రాయగడ: రాయగడలో బురదల పోలమ్మ అమ్మవారి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి.ఈసందర్భంగా అమ్మవారి అనుపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం అర్థరాత్రి పూజారులు ఊరుకట్టు కార్యక్రమం, అనంతరం మల్లెలు తొక్కడం, ఉయ్యాలకంబాల కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామునుంచే ఘటాలతో పూజామండపం వద్దకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు.

చేయూత నిధులు జమచేయాలి

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: మహిళల ఖాతాల్లో జగనన్న చేయూత నాలుగోవిడత నిధులు జమచేయాలని సీఐటీయూజిల్లా కార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి గొర్లె వెంకటరమణ డిమాండ్‌చేశారు. బుధవారం చేయూత నిధులు జమకాని బాధిత మహిళ లు పార్వతీపురం సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వ హించి, అక్కడ నిరసన తెలిపారు. అనంతరం సీఐటీయూ నాయకులు, మహిళలు జేసీ శోభితకు వినతిప త్రం అందించారు.

ఘనంగా పైడిమారమ్మ తల్లి పండుగ

కురుపాం: కురుపాం పైడిమారమ్మ తల్లి ఒంటిగటం అమ్మవారు పండుగ మంగళ, బుధవారాల్లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారు ఆలయం నుంచి కోట వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. బుధవారం ఆలయం వద్దకు తీసుకు వెళ్లి అనుప పండుగా నిర్వహించారు.

450 ఎకరాల్లో వరి ఎదలు: ఏవో

సీతానగరం: మండలంలో రైతులు దాదాపుగా 450 ఎకరాలు వరకు వరి ఎదలు వేశారని ఏవో ఎస్.అవినాష్ తెలిపారు. బుధవారం మండలంలోని జోగింపేట, ఇప్పలవలస, పాపమ్మవలస తదితర గ్రామాల్లో వరి ఎదలను పరిశీలించారు.

ఎన్నికల డ్యూటీ ధ్రువపత్రాలు ఇవ్వాలి

సాలూరు రూరల్: సాధారణ ఎన్నికల్లో సాలూరు నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి డ్యూటీ ధ్రువపత్రాలివ్వాలని పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇందుపూరి గున్నరాజు డిమాండ్ చేశారు. బుధవారం సాలూరులో విలేకరులతో మాట్లాడుతూ గత నెల 13న జరిగిన పోలింగ్, ఎన్నికలకు శిక్షణకు సంబంధించి సాలూరు పలువురు ఎన్నికల విధులు నిర్వహించారని తెలిపారు.

విద్యుత్‌సరఫరాలో అంతరాయంతో ఇబ్బందులు

సీతంపేట: మండలంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలగడంతో వినియోగదారులు ఇబ్బందిపడ్డారు. కనీసం విద్యుత్ అంతరాయంపై ముందస్తుగా సమాచారం తెలియజేయలేదని పలువురు వాపోయారు. కాగా విద్యుత్ అంతరాయానికి సంబంధించి తన వద్ద సమాచారం లేదని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలకృష్ణ తెలిపారు.

జ్వరాలపై ఇంటింటా సర్వే

భామిని:వర్షాలు కురుస్తుండడంతో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి రవీంద్ర సూచించారు. పాలవలసలో ఇంటింటా జ్వరాలపై సర్వే నిర్వహించారు.

ఉమా రామాలింగేశ్వరాలయ వార్షికోత్సవం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బైపాస్ రహదారిలో గల ఉమారామాలింగేశ్వరాలయ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం కమనీయంగా జరిగింది. కార్యక్రమంలో శ్రీనివాసరావు, లక్ష్మణరావు దంపతులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

పాలకొండ: పట్టణంలోని జగన్నాథ స్వామి యాత్రకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు.

పీటీజీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సురేష్

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి పీటీజీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సురేష్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు.

భామిని ఏకలవ్య ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

సీతంపేట/భామిని: భామిని ఏకలవ్య ప్రిన్సిపాల్‌గా గుండపల్లి గంగాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఏకలవ్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్‌గా గురుకుల పాఠశాలకు చెందిన కె.సురేష్ బాధ్యతలు నిర్వహించేవారు. బుధవారం ఏకలవ్య రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా గంగాదేవికి ఆయన బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి: డీఈవో

భామిని: విద్యారులు పట్టుదలతో చదవాలని డీఈవో పగడాలమ్మ కోరారు. బుధవారం స్థానిక ఏపీ ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన గురుబిల్లి లావణ్య, గుడ్ల సాయిలక్ష్మి, మండల భావ్యశ్రీలను ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ ఆధ్వర్యంలో అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు శ్రీనివాసరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

మేకలకు టీకాలు

సీతంపేట: గొర్రెలు, మేకలు, పశువులకు చీడిపారుడు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్టు పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావుతెలిపారు. దోనుబాయి, పొల్ల, బగ్గ వెటర్నరీ డిస్పెన్సరీల్లో వ్యాక్సిన్లు వేయడం వల్ల వ్యాధి సోకకుండా అరికట్టవచ్చునన్నారు.